క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల (సూర్యాపేట) : మండల పరిధిలోని బి.చందుపట్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చందుపట్ల, వట్టిఖమ్మంపహాడ్, భీమ్లాతండా, పాశ్యానాయక్‌తండా, పాండ్యానాయక్ తండా, తిమ్మాపురం, అక్కలదేవిగూడెం, లక్ష్మణ్‌నాయక్ తండాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేలవాలిన వరి పొలాల పరిశీలన

చివ్వెంల (సూర్యాపేట) : చివ్వెంల మండలంలోని గుంజలూరు, వల్లభాపురం, గుంపుల, జి.తిర్మలగిరి గ్రామాల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నేలవాలిన వరి చేలను వ్యవసాయ విస్తరణ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు మౌనిక, వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ

నాగారం : మండల పరిధిలోని నాగారం బంగ్లాలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు తంగెళ్లపల్లి ఎల్లప్ప–కౌసల్య దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సత్యనారాయణ గురువారం ఆరు సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటకండ్ల ముకుందారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి: మండల కేంద్రం అర్వపల్లిలోని యోగా షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి అభిషేకం, పల్లకీ సేవ, పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. పూజా కార్యక్రమంలో అర్చకుడు గిరిసాయిరాం, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మృతుల తండ్రి వేముల దేవయ్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్తులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురానికి చెందిన అన్నదమ్ములు వేముల నాగరాజు, కార్తీక్ ఇటీవల బైక్ ప్రమాదంలో మృతిచెందారు. వారి కుటుంబానికి గ్రామానికి చెందిన యువత, ఉద్యోగులు కలిసి గురువారం రూ.53 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తిరుమని యాదగిరి, ప్రసాద్, సుధాకర్, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థిక సాయం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కోడూరు గ్రామానికి చెందిన కొట్టూరి వెంకన్న ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడటంతో వైద్య ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుయ్యని బాబు, నిద్ర సంపత్‌నాయుడు, కాంగ్రెస్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయవాది దీన్‌దయాళ్

తిరుమలగిరి (తుంగతుర్తి) : సమాచార హక్కు చట్టంపై తిరుమలగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది వై.దీన్‌దయాళ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా అవినీతి నిర్మూలనకు పాటుపడాలని, అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మృత్యుంజయ్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదావరి జలాలతో పంటలకు జీవం

- వరి ఎండిపోతున్న దశలో నీటి విడుదల
- జాజిరెడ్డిగూడెం మండలంలో 20 వేల ఎకరాలకు పైగా సాగు



పర్సాయపల్లి సమీపంలో సాగులో ఉన్న వరి

అర్వపల్లి : పంటలు ఎండిపోతున్న దశలో గోదావరి జలాలను విడుదల చేయడంతో తిరిగి ఊపిరిపోసుకున్నాయి. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాన కాలం సీజన్ ప్రారంభంలో సరైన వర్షాలు కురవకపోవడంతో జాజిరెడ్డిగూడెం మండలంలో రైతులు సాగు చేసిన వరి పొలాలు తొలుత ఎండిపోయే దశకు చేరాయి. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. గోదావరి జలాలను విడుదల చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నారు. కాగా, ఈ క్రమంలోనే ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరదలు రావడంతో గత నెల 8న జిల్లాకు గోదావరి జలాలను విడుదల చేశారు. దీంతో ఎండిపోతున్న వరి పంటలకు ప్రాణం పోసినట్లయింది. కాగా, గోదావరి జలాలను వారబందీ విధానంలో విడుదల చేస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ నిరంతరాయంగా వదులుతున్నారు.

20 రోజుల్లో చేతికందనున్న పంటలు

జాజిరెడ్డిగూడెం మండలంలో ఈసారి 20 వేల ఎకరాలకు పైగానే పంటలు సాగయ్యాయి. సీజన్ మొదట్లో నీటి వసతి ఉన్న కొద్దిమంది రైతులు పంటలు సాగు చేశారు. గోదావరి జలాలను నమ్ముకొని ఉన్న రైతులు కొంత ఆలస్యంగా వరి సాగు చేపట్టారు. మరో 20 రోజుల్లో వరి పంట చేతికందనుంది. ప్రస్తుతం గోదావరి జలాలు ఆగకుండా వస్తుండటంతో ఆ నీటిని రైతులు సమృద్ధిగా వాడుకుంటున్నారు.



71 డీబీఎం కాల్వలో పారుతున్న గోదావరి జలాలు

ఆరు ఎకరాలు సాగు చేశాను



ఈసారి 6 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పూర్తిగా గోదావరి జలాలపైనే ఆధారపడి వరి సాగు చేశా. మొదట సకాలంలో నీటిని విడుదల చేయకపోవడంతో పంట కొంత ఎండిపోతుండగా అదే సమయంలో నీటిని విడుదల చేశారు. దీంతో పూర్తిగా ఆ నీటితోనే పంటలు బయటపడ్డాయి.

– శివరాత్రి కృష్ణ రైతు, పర్సాయపల్లి

రైతుల అవసరానికి సరిపడా..



ఈ సీజన్‌లో గోదావరి జలాలను రైతులకు అవసరమైన మేర వదులుతున్నాం. వారబందీ విధానం అయినప్పటికీ గత నెలలో నీటిని విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆపకుండా గోదావరి జలాలను వదులుతున్నాం. చివరి ప్రాంతాలకు చేరేలా ఎక్కువ నీటిని సరఫరా చేస్తున్నాం.

– ఎం.సత్యనారాయణగౌడ్, నీటిపారుదలశాఖ ఈఈ

హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్

- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



మద్దిరాల : కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తుంగతుర్తి : హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగంధర్ రావుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, పింఛన్ల పెంపు, విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి, ఆటో కార్మికులు, వ్యవసాయ కూలీలకు సాయం విషయంలో మోసం చేసిన దుర్మార్గులు కాంగ్రెస్ నాయకులు అని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, జిల్లా నాయకులు కేతిరెడ్డి గోపాల్ రెడ్డి, గుండగాని రాములు గౌడ్, తునికి సాయిలు, గాజుల యాదగిరి, గుండగాని దుర్గయ్య, మహిళా కమిటీ అధ్యక్షురాలు తునికి లక్ష్మమ్మ, గోపగాని శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీల కార్డు ఇప్పుడు బాకీ కార్డుగా మారిందని, హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మద్దిరాలలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులకు బాకీ కార్డులను చూపించి హామీలపై నిలదీయాలని అన్నారు. మండలంలో రుణమాఫీ పూర్తిగా అయిన గ్రామం, వృద్ధులు రూ.4 వేల పింఛన్ ఎత్తుకునే గ్రామం, కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం తీసుకున్న మహిళలు, నెలకు రూ.2,500 తీసుకుంటున్న మహిళలు ఉన్న గ్రామం ఉంటే చెప్పాలని కాంగ్రెస్ నాయకులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ఏ.రజాక్, మాజీ వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోడి శ్రీనివాస్, వడ్డాణం మధుసూదన్, రావుల వెంకన్న, సూరినేని రాజు, అవిలయ్య, తిరుమలరావు, దామెర్ల వెంకన్న, గోల్కొండ మల్లేష్, ఈరావుల సైదులు, మల్యాల నర్సయ్య పాల్గొన్నారు.

సహజ కాన్పులపై గర్భిణులకు అవగాహన

నాగారం : మండల కేంద్రం నాగారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ యనగందుల నాగరాజు ఆధ్వర్యంలో సహజ కాన్పులపై గర్భిణులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేయాలని, తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, మందులు వాడాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహజ కాన్పు ద్వారా కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఈ సందర్భంగా 43 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ విమలమ్మ, పీహెచ్ఎన్ఓ అరుణకుమారి, సూపర్‌వైజర్లు వినోద, రామచంద్ర, సిబ్బంది సుజాత, సరస్వతి, యాదగిరి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగారం పీహెచ్‌సీలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగరాజు

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

నూతనకల్ : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి లిఖిత్ అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు వారాలకు మించి జలుబు, బరువు కోల్పోవడం, తెమడలో రక్త జీరలు, రాత్రి సమయంలో జ్వరం ఉన్నట్లయితే క్షయ వ్యాధిగా అనుమానించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 120 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శరణ్‌నాయక్, శిరీష, సుమాంజలి, దీపిక, ప్రసాద్, మాధవరెడ్డి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ



కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 26వ వార్డులో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం గడపగడపకూ కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేటలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ప్రజలే స్వచ్ఛందంగా తమకు వివరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నిమ్మల స్రవంతి, బీఆర్ఎస్ నాయకులు నల్లపాటి అప్పారావు, రేపల్లె ఉపేందర్, లతీఫ్, వట్టే లింగరాజు, వెంపటి శ్రీనివాస్, నాగరాజు, సుదర్శన్, సఫియా, ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న యామ ప్రభాకర్

సూర్యాపేట : ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త యామ ప్రభాకర్ అన్నారు. ప్లాస్టిక్ నియంత్రణపై స్థానిక బాల భవన్‌లో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించి క్లాత్ సంచులను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని వదిలేసి క్లాత్‌తో తయారు చేసిన సంచులను వినియోగించడం వల్ల రాబోయే తరానికి సాయం చేసినట్లు అవుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యం భయంకరమైన స్థాయిలోకి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ సంచుల వల్ల పర్యావరణంపై కలిగే హానికరమైన ప్రభావాలపై అవగాహన పెంచి, వాటి వాడకాన్ని తగ్గించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, బండి రాధాకృష్ణారెడ్డి, వీరునాయుడు, అరుంధతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే నివాళి



సైదులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కోడూరు గ్రామానికి చెందిన జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొబ్బ్ర సైదులు (80) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్.. సైదులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. సైదులు గతంలో వార్డు సభ్యుడిగా, నీటి సంఘం చైర్మన్‌గా కూడా పనిచేశారు.

‘బీసీలను మోసం చేసిన ప్రభుత్వం’

పెన్‌పహాడ్ : రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల మాదిరిగానే రిజర్వేషన్ల విషయంలో మోసానికి పాల్పడిందని అన్నారు. బీసీల రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలు ఇ కేవైసీ చేయించుకోవాలి

పెన్‌పహాడ్ : ఉపాధి హామీ కూలీలు ముఖ గుర్తింపు హాజరు కోసం జాబ్‌కార్డుకు ఆధార్ కార్డుతో ఇ కేవైసీ చేయించుకోవాలని ఏపీడీ పవన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఈ కేవైసీ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇ కేవైసీ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలు జాబ్‌కార్డు, ఆధార్ కార్డుతో స్థానిక క్షేత్ర సహాయకుల ద్వారా ఇ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రవి, ఈసీ మహేష్, టీఏలు ఏకస్వామి, వెంకటేశ్వర్లు, రాంకుమార్, బుచ్చన్న, అనూష, ఎఫ్ఏ కవి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ పవన్‌కుమార్

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ఆత్మకూరు (ఎస్) (సూర్యాపేట) : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన పోషణ మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణులు ఆహారంలో చక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించుకోవాలని తెలిపారు. అప్పుడే పిల్లల ఎదుగుదల బాగుంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ధారాసింగ్, సీడీపీఓ శ్రీవాణి, ఏసీడీపీఓ సాయి గీత, మెడికల్ ఆఫీసర్ మౌనిక, సూపర్‌వైజర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు

రాజ్యాంగంపై జరిగిన దాడిగా చూడాలి

హుజూర్‌నగర్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడి దేశ రాజ్యాంగంపై జరిగిన దాడిగా చూడాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోశపతి అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయమూర్తిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని పార్టీలకతీతంగా ఖండించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, వెంకన్న, రాజేష్, నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడులు



సర్వే నిర్వహిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : వరి సాగులో వెదజల్లే, డ్రమ్ సీడర్ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించొచ్చని కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ తెలిపారు. మండల పరిధిలోని లింగాల గ్రామంలో ఐసీఏఆర్ భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో నేరుగా విత్తే పద్ధతిలో వరి సాగు చేస్తున్న రైతుల పొలాల్లో శాస్త్రవేత్తలు గురువారం బెంచ్‌మార్క్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా చీడపీడల సమస్య, నీటి, కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మోతాదులో ఎరువులు వాడాలని రైతులకు సూచించడంతో పాటు రైస్ క్లినిక్ అప్లికేషన్ వాడే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు ఎ.సాయికిరణ్, అజయ్, రైతులు బత్తిని అంజయ్య, మామిడి రాంబాబు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసేందుకే 42 శాతం రిజర్వేషన్ల డ్రామా

మునగాల : బీసీలను మోసం చేసేందుకే 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామా ఆడిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ ఆరోపించారు. గురువారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. దేశంలో న్యాయనిపుణులు, సీనియర్ రాజకీయ వేత్తలు నెత్తినోరు కొట్టుకొని 42శాతం రిజర్వేషన్లు సాధ్యపడదని చట్టపరంగా ఇస్తేనే సాధ్యపడుతుందని మొరపెట్టుకున్నప్పటికీ వినకుండా ఎన్నికల కమిషన్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేయించి బీసీ వర్గాలను నిలువునా మోసం చేశారని అన్నారు.

నామినేషన్లు నిల్

అర్వపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం మొదలు కాగా తొలి రోజు మండలంలో ఎవరూ నామినేషన్ దాఖలు కాలేదు. ఎంపీడీఓ టి.గోపి, తహసీల్దార్ శ్రీకాంత్ నామినేషన్ల ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామినేషన్ల కేంద్రం వద్ద బందోబస్తును నాగారం సీఐ నాగేశ్వరరావు పరిశీలించారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయగా, ఏ ఒక్క స్థానానికి కూడా అభ్యర్థులు నామినేషన్ వేయలేదు.

నాగారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. తొలిరోజు ఒక్కరు కూడా నామినేషన్ కూడా దాఖలు చేయలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికిషోర్ శర్మ, ఎంపీడీఓ మారయ్య, ఎస్ఐ ఎస్‌కే.యాకూబ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు పంపిణీ

ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట) : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నామినేషన్ల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మొదటి రోజు ఎంపీటీసీ అభ్యర్థులకు ఆరు సెట్ల నామినేషన్ పత్రాలను పంపిణీ చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ అమీనుద్దీన్, ఎంపీడీఓ హాసిం, ఎస్సై శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్)లో నామినేషన్ పత్రం తీసుకుంటున్న ఆశావహుడు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగుల్ నాయక్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. మొదటి రోజు 12 మందికి ఎంపీటీసీ నామినేషన్ల పత్రాలను, ఒకరికి జెడ్పీటీసీ నామినేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, ఎంపీడీఓ శేషకుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల ఏర్పాట్లను ఆర్డీఓ వేణుమాధవ్‌రావు గురువారం పరిశీలించారు.

సురేష్‌బాబు మృతి తీరని లోటు

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దొడ్డా సురేష్‌బాబు గుండెపోటుతో మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం చిలుకూరులో సురేష్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పించి మృతుడి కుటుంబసభ్యులకు తన సానుభూతి వ్యక్తం చేశారు. సురేష్‌బాబు మంచి గుణం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. సురేష్‌బాబు కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కుటుంబసభ్యులు ఉన్నారు.



చిలుకూరులో దొడ్డా సురేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

చేగువేరా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : ప్రజా పోరాటాలే శ్వాసగా జీవించిన విప్లవవీరుడు చేగువేరా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను అన్నారు. గురువారం నేరేడుచర్లలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతి నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అమరారపు పున్నయ్య, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కోమ్రాజు వెంకట్, ఎస్‌కె మధార్ తదితరులు ఉన్నారు.

మోసకారి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

హుజూర్‌నగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో మోసకారి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బూరుగడ్డలో నిర్వహించిన పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలు చేయకుండా ప్రజలను నట్టేటా ముంచిందని, దానిని ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎన్నికలు ఏవైనా బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయాలని ఆయన కోరారు. అనంతరం బాకీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, నాయకులు డాక్టర్ కేఎల్ఎం రెడ్డి, షేక్ సలీమా రంజాన్, అన్నెం శిరీషా కొండారెడ్డి, పత్తిపాటి రమ్య నాగరాజు, గువ్వల వీరన్న, చికూరి రాజారావు, షేక్ అలిపాషా, పల్లె నాగిరెడ్డి, మల్లెపల్లి వీరబాబు, కామిశెట్టి వెంకటేశ్వర్లు, కె.సతీష్, ఎం.పరశురాం తదితరులు పాల్గొన్నారు.